

వైసిపి టెక్కలి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా దువ్వాడ వాణి?



ప్రజాశక్తి - టెక్కలి రూరల్

వైసిపి టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్తగా జెడ్‌పిటిసి దువ్వాడ వాణిని నియమించినట్లు విశ్వసనీయ సమాచారం. నియోజకవర్గ ఇన్‌ఛార్జి, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, ఆయన భార్య వాణి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వద్ద గురువారం చర్చలు చేసినట్లు తెలుస్తోంది. ఈ చర్చల్లో చివరకు వాణికే నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించేందుకు జగన్ మొగ్గు చూపినట్లు తెలిసింది. వచ్చే ఎన్నికల్లో వైసిపి అభ్యర్థిగా శ్రీనివాస్ పేరును ఇప్పటికే రెండుసార్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఆయన్ను ఇన్‌ఛార్జీగా తప్పించి ఆయన భార్యకు కట్టబెట్టారన్న వార్త ఆ పార్టీ శ్రేణుల్లో చక్కర్లు కొడుతోంది.



కలెక్టరేట్ వద్ద బైఠాయించి ధర్నా చేస్తున్న ఉపాధి హామీ కూలీలు

కేంద్రంపై కూలీల కన్నెర్ర

- 'ఉపాధి' రక్షణకు కలెక్టరేట్ వద్ద ధర్నా
- భారీగా తరలివచ్చిన పేదలు
- ఉపాధి చట్టం నిర్వీర్యంపై ఆగ్రహం
- కూలీల పొట్టగొడుతున్న కేంద్రం
- వ్య.కా.స నాయకుల ధ్వజం

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్న కేంద్ర ప్రభుత్వంపై కూలీలు కన్నెర్ర చేశారు. ఉపాధి హామీ చట్టం రక్షణ కోసం గురువారం కలెక్టరేట్ వద్ద వ్యవసాయ కార్మిక సంఘం తలపెట్టిన ధర్నాకు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. నిధులు తగ్గించి, రకరకాల షరతులతో తమను పనులకు దూరం చేస్తున్న బిజెపి ప్రభుత్వ తీరుపై ఆక్రోశం వెళ్లగక్కారు. కలెక్టరేట్ గేటు ముందు బైఠాయించి మండుటెండలో తమ నిరసనను వ్యక్తం చేశారు. రెండు పూటల పని రద్దు, 200 రోజులు పని కల్పించాలని, రూ.600 కూలి ఇవ్వాలని పెద్దపెట్టున నినాదాలు చేశారు. కూలీల నిరసనల నేపథ్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. కలెక్టరేట్ లోపలకు ప్రవేశించేందుకు ప్రయత్నిస్తే అరెస్టులు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించేందుకు వాహనాలను సైతం సిద్ధం చేశారు. కూలీలు శాంతియుతంగా నిరసన తెలిపి అనంతరం డిఆర్‌ఒ రాజేశ్వరికి వినతిపత్రం అందజేశారు.

కూలీల పొట్ట కొడుతున్న కేంద్రం


ఉపాధి హామీ చట్టానికి కేంద్ర ప్రభుత్వం నిధులు తగ్గించి కూలీల పొట్ట కొడుతోందని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిర్ల ప్రసాద్, గంగరాపు సింహాచలం అన్నారు. కలెక్టరేట్ వద్ద ధర్నా అనంతరం కూలీలనుద్దేశించి మాట్లాడారు. కేంద్రం ప్రభుత్వం ఉపాధి హామీకి గత సంవత్సర బడ్జెట్‌లో రూ.89 వేల కోట్లు కేటాయించిందన్నారు. 2023 బడ్జెట్‌లో దాన్ని రూ.60 వేల కోట్లకు కుదించిందని చెప్పారు. ఉపాధి హామీ పనిలో గతంలో కూలీలకు అనేక సౌకర్యాలు ఉండేవని, ఇప్పుడు వాటిని తొలగించేశారని విమర్శించారు. రెండు పూటల పనిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వేసవి కాలంలో ఇవ్వాల్సిన సమ్మర్ అలవెన్స్‌నూ తీసేసిందన్నారు. వంద రోజులు పూర్తి చేసిన కుటుంబాలకు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం పని దినాలు చూపించాలని డిమాండ్ చేశారు. గ్రామాలతో పాటు పట్టణాల్లోనూ ఉపాధి హామీ కల్పించాలన్నారు. పనిచేసే చోట కనీస సౌకర్యాలైన మంచినీరు, టెంట్లు, మెడికల్ కిట్లు లేవని విమర్శించారు.

సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఈశ్వరమ్మ, కె.ఎల్లయ్య మాట్లాడుతూ వారంలో ఆరు రోజులు పనిచేస్తే మూడు, నాలుగు రోజులకు బిల్లు జనరేట్ అవుతుందని, మిగిలిన రోజులు నమోదు కాకపోవడంతో కూలీలు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూలీలకు పే స్లిప్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిగ్నల్స్ లేక యాప్‌లు పనిచేయడం లేదని, మాన్యువల్ పద్ధతినే కొనసాగించాలన్నారు. కూలీలకు 2021 నుంచి ఇప్పటివరకు ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. దూర ప్రాంతాలకు ఆటోలో వెళ్లి పనిచేసే వారికి ఛార్జీలు ఇవ్వాలని కోరారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, ఒసి అన్న వ్యత్యాసం లేకుండా అందరికీ సమానంగా ఒకేసారి పని కల్పించాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా నాయకులు కె.సూరయ్య, టి.తిరుపతిరావు ధర్నాకు సంఘీభావం తెలిపారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరిని కలిసి వినతిపత్రం అందించారు. ధర్నాలో సంఘ నాయకులు ఎస్.సింహాచలం, పి.రమ, ఆర్.అమల, రాజేశ్వరి, బి.ప్రసాద్, బి.అప్పయ్య, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

టిఎస్ ఎంసెట్ టాపర్ మనోడే

- నందిగాంకు చెందిన అనిరుధ్‌కు ఒకటో ర్యాంకు
- బోయిన సంజనకు ఎనిమిదో ర్యాంకు
- మెడిసిన్‌లో మెరిసిన వరుణ్ చక్రవర్తి





అనిరుధ్ (ఇంజినీరింగ్) వరుణ్ చక్రవర్తి (మెడిసిన్) సంజన (ఇంజినీరింగ్)

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, నందిగాం, పోలాకి

తెలంగాణ ఎంసెట్ ఫలితాల్లో సిక్కోలు విద్యార్థులు టాప్ లేపారు. నందిగాం మండలం దిమ్మిలాడకు చెందిన సనపల అనిరుధ్ ఏకంగా ప్రథమ ర్యాంకు సాధించి స్టేట్ టాపర్‌గా నిలిచాడు. ఇంజినీరింగ్ విభాగంలో ఎనిమిదో ర్యాంకూ మన జిల్లాకు చెందిన విద్యార్థే కైవసం చేసుకున్నారు. శ్రీకాకుళం నగరం అరసవల్లికి చెందిన బోయిన సంజన దక్కించుకున్నారు. మెడిసిన్‌లో పోలాకి మండలం తోటాడకు చెందిన బోర వరుణ్ చక్రవర్తి ఐదో ర్యాంకు సాధించాడు. వీరంతా ఎపి ఎంసెట్ పరీక్షలనూ రాశారు. వాటిలోనూ మంచి ర్యాంకులు వస్తాయని ఆశిస్తున్నారు.

నందిగాం మండలం దిమ్మిలాడకు చెందిన సనపల అనిరుధ్ తెలంగాణ ఎంసెట్ ఫలితాల్లో స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించి తన సత్తా చాటారు. మొత్తం 160 మార్కులకు గానూ 158.90 వచ్చాయి. తండ్రి ఖగేశ్వరరావు విశాఖ పోర్టు టౌన్ ఏరియా సబ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. తల్లి ఝాన్సీ గృహిణి. తండ్రి ఖగేశ్వరరావు ఉద్యోగ రీత్యా విశాఖలో ఉద్యోగం చేస్తుండడంతో కుటుంబం అక్కడకు మారింది. అనిరుధ్ తాత అచ్యుతానందం, నాన్నమ్మ దిమ్మిలాడలోనే ఉంటున్నారు. అనిరుధ్ ఒకటి నుంచి ఐదో తరగతి వరకు దిమ్మిలాడలోనే చదివారు. ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు విశాఖపట్నంలోని శ్రీ చైతన్య స్కూల్‌లో చదివారు. విజయవాడలోని శ్రీచైతన్య కళాశాలలో ఇంటర్ చదివి 982 మార్కులు సాధించారు. ఇటీవల విడుదలైన జెఇఇ మెయిన్స్‌లో జనరల్ విభాగంలో 122, ఒబిసి కేటగిరీలో 25వ ర్యాంకు సాధించారు. తమ గ్రామానికి చెందిన అనిరుధ్‌కు స్టేట్ ఫస్ట్ ర్యాంకు వచ్చిందన్న వార్తతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. ఐఐటి ముంబైలో చేరి ఇంజినీరింగ్ చేయాలన్నది తన లక్ష్యమని అనిరుధ్ పేర్కొన్నాడు

సంజనకు ఎనిమిదో ర్యాంకు

అరసవల్లికి చెందిన బోయిన సంజన ఇంజినీరింగ్ విభాగంలో 155.54 మార్కులతో ఎనిమిదో ర్యాంకు సాధించింది. ఒకటి నుంచి పదో తరగతి వరకు శ్రీకాకుళంలోని శ్రీ చైతన్య స్కూల్‌లో చదివారు. ఇంటర్ విజయవాడలోని శ్రీ చైతన్య కళాశాలలో చదివి 982 మార్కులు సాధించారు. ఇటీవల విడుదలైన జెఇఇ మెయిన్స్‌లో జనరల్ విభాగంలో 729వ ర్యాంకు వచ్చింది. తండ్రి బోయిన గణేష్ అరసవల్లిలో ఫౌల్ట్రీ వ్యాపారం చేస్తున్నారు. తల్లి గృహిణి. ప్రస్తుతం సంజన జూన్ నాలుగో తేదీన జరుగనున్న ఐఐటి అడ్వాన్స్ పరీక్షకు సాధన సాగిస్తున్నారు.

మెడిసిన్‌లో మెరిసిన వరుణ్ చక్రవర్తి

పోలాకి మండలం తోటాడకు చెందిన బోర వరుణ్ చక్రవర్తి మెడిసిన్ విభాగంలో ఐదో ర్యాంకు సాధించాడు. మొత్తం 160 మార్కులకు గానూ 152.64 మార్కులు వచ్చాయి. తండ్రి రాజేంద్రనాయుడు నరసన్నపేటలో జిల్లాపరిషత్ స్కూల్‌లో ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నారు. తల్లి రాజ్యలక్ష్మి పోలాకి మండలం దీర్ఘాసి ఎంపిపి స్కూల్‌లో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. వరుణ్ చక్రవర్తి ఒకటి నుంచి పదో తరగతి వరకు విశాఖలోని శ్రీచైతన్య స్కూల్‌లో చదివారు. ఇంటర్ విజయవాడలోని శ్రీ చైతన్య కళాశాలలో చదివి 987 మార్కులు సాధించారు. నీట్‌లో మంచి ర్యాంకు సాధించి ఎంబిబిఎస్ చదివి డాక్టర్ కావాలన్నదే తన లక్ష్యమని వరుణ్ చక్రవర్తి చెప్పారు.



ఎరుకులపేట వద్ద రహదారిని ప్రారంభిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన

శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి - పొందూరు

రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులను కల్పిస్తోందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని నరసాపురం, భగవానుదాసుపేట, ఎరుకులపేటలో ఇటీవల నిర్మించిన రహదారులను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో పక్కా రహదారుల నిర్మాణానికి చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 98 శాతం హామీలను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అమలు చేశారని తెలిపారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పాలిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారని చెప్పారు. ప్రభుత్వం తీసుకొచ్చిన గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ దేశానికే తలమానికంగా నిలిచిందన్నారు. అవినీతికి ఆస్కారం లేకుండా పారదర్శకంగా సంక్షేమ కార్యక్రమాలు అమలవుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, పిఎసిఎస్ అధ్యక్షులు కె.రమణమూర్తి, ఎఎంసి చైర్మన్ బాడాన సునీల్‌కుమార్, వైసిపి మండల, పట్టణాధ్యక్షులు పప్పల రమేష్‌కుమార్, గాడు నాగరాజు, సర్పంచ్ రేగిడి లక్ష్మి, పలువురు సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

పలువురు ఎస్‌ఐలకు స్థానచలనం

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో పలువురు ఎస్‌ఐలను బదిలీ చేస్తూ ఎస్‌పి జి.ఆర్ రాధిక గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. బారువ ఎస్‌ఐ జి.సత్యనారాయణను పోలాకి, కంచిలి ఎస్‌ఐ ఎస్.చిరంజీవిని బారువకు బదిలీ చేశారు. సోంపేట ఎస్‌ఐ ఎస్.బాలరాజును కంచిలికి పంపారు. విఆర్‌లో ఉన్న డి.హైమావతిని సోంపేటకు బదిలీ చేశారు. శ్రీకాకుళం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఎన్.లక్ష్మణరావును శ్రీకాకుళం రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. విఆర్‌లో ఉన్న వి.రమేష్‌ను ఇచ్ఛాపురం రూరల్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. విఆర్‌లో ఉన్న జి.ప్రభాకరరావును పాతపట్నం పోలీస్ స్టేషన్‌కు, పాతపట్నంలో పనిచేస్తున్న ఎన్.కామేశ్వరరావును గార ఎస్‌ఐగా బదిలీ చేశారు.



మిల్లర్లతో మాట్లాడుతున్న జెసి నవీన్

రైస్ మిల్లర్లపై జెసి ఆగ్రహం

పొందూరు : రెండు నెలలుగా పెండింగ్‌లో ఉన్న సిఎంఆర్ రైస్ బకాయిలను మిల్లర్లు చెల్లించకపోవడంపై జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని పలు రైస్‌మిల్లులను గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. కొంచాడ వద్ద గల సాయిశివమణికంఠ రైస్‌మిల్లు 2,030 క్వింటాళ్లు, శ్రీలక్ష్మీరాజ్యం రైస్‌మిల్లు 2,175 క్వింటాళ్లు, పొందూరులోని శ్రీలక్ష్మి రైస్‌మిల్లు సుమారు 2,030 క్వింటాళ్ల రైస్ బకాయిలు ఉన్నట్లు గుర్తించారు. వీటిని రెండు రోజుల్లో ఎఫ్‌సిఐకు చెల్లించాలని, లేకుంటే సంబంధిత మిల్లును సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ రాఘవేంద్రమీనా, డిఎస్‌ఒ వెంకటరమణ, తహశీల్దార్ ఎస్.రాంబాబు తదితరులున్నారు.

గ్రామాల వారీగా రీ సర్వే లక్ష్యాల సాధన

శ్రీకాకుళం అర్బన్ : సమగ్ర భూ రీ సర్వే పనులు త్వరితగతిన పూర్తి చేయాలని భూ పరిపాలన ప్రధాన కమిషనర్ జి.సాయిప్రసాద్ అధికారులను ఆదేశించారు. గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ రోవర్లను మార్చుకుంటూ పనులు చేపట్టాలన్నారు. డేటా ఎంట్రీ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఇందులో తహశీల్దార్లు, విఆర్‌ఒలు పాల్గొనాలని సూచించారు. గ్రామస్థాయిలో సర్వేయర్లు డేటా ఎంట్రీలో పాల్గొనాలని, గ్రామాల వారీగా లక్ష్యాలను నిర్దేశించుకొని పనిచేయాలని ఆదేశించారు. గ్రామ సర్వేయర్లకు ఒక్కో గ్రామం కేటాయించి, ఆ గ్రామంలో రీ సర్వే పూర్తయ్యేలా పనులను వేగవంతం చేయాలన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో అర్జీదారుల సంతృప్తి స్థాయిని పెంచాల్సిన బాధ్యత ప్రతి జిల్లా అధికారిపై ఉందన్నారు. కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, సర్వే, భూ రికార్డుల సహాయ సంచాలకులు కె.ప్రభాకరరావు, అధికారులు పాల్గొన్నారు.



ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్‌లో వేచి ఉన్న ప్రయాణికులు

రైళ్ల రాకపోకలకు అంతరాయం

- ఒడిశాలో రైలు ప్రమాదంతో ఆలస్యం
- పలు రైల్వేస్టేషన్లలో రైళ్లు నిలిపివేత
- పడిగాపులు కాసిన ప్రయాణికులు
- ఉక్కపోతతో అవస్థలు

ప్రజాశక్తి - ఆమదాలవలస, పలాస, టెక్కలి, ఇచ్ఛాపురం

ఒడిశా రాష్ట్రంలోని ఛత్రపూర్-గంజాం రైల్వేస్టేషన్ల మధ్య గూడ్స్ రైలు ఇంజిన్ పట్టాలు తప్పడంతో విశాఖ-భువనేశ్వర్ మార్గంలో రైళ్ల రాకపోకలకు గురువారం అంతరాయం ఏర్పడింది. ఖుర్దారోడ్, పలాస నుంచి రిలీఫ్ రైలు వెళ్లి పట్టాలు తప్పిన రైలును పునరుద్ధరించారు. దీంతో పలు రైళ్లను శ్రీకాకుళం రోడ్డు (ఆమదాలవలస), నౌపడ ఆర్‌ఎస్, పూండీ, పలాస, సోంపేట, ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్లలో రెండు గంటల పైబడి నిలిపివేశారు. పలు రైళ్లు రెండు నుంచి ఆరు గంటల పాటు ఆలస్యంగా నడిచాయి. విశాఖ ఎక్స్‌ప్రెస్‌ను పూండీలో నిలుపుదల చేశారు. పాసింజర్ రైళ్లను మందస, ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్లలో నిలిపివేశారు. నౌపడ ఆర్‌ఎస్‌లో తిరుపతి నుంచి పూరీ వెళ్లే ఎక్స్‌ప్రెస్‌ను నిలిపివేశారు. పునరుద్ధరణ పనులు పూర్తయ్యాక రైళ్ల రాకపోకలు ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 10.30 గంటలకు శ్రీకాకుళం రోడ్డు రైల్వేస్టేషన్‌కు రావాల్సిన ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ నాలుగు గంటలు ఆలస్యంగా వచ్చింది. మధ్యాహ్నం 1.35 గంటలకు రావాల్సిన విశాఖ ఎక్స్‌ప్రెస్ గంటన్నర ఆలస్యంగా వచ్చింది. గౌహతి-ఎర్నాకుళం ఎక్స్‌ప్రెస్ మధ్యాహ్నం ఒంటి గంటకు రావాల్సి ఉండగా సాయంత్రం ఆరు గంటలకు వచ్చింది. మధ్యాహ్నానికే రైల్వే ట్రాక్ క్లియర్ కావడంతో సాయంత్రం నుంచి రావాల్సిన అన్ని రైళ్లూ యథావిధిగా నడిచాయి. రైళ్ల నిలిపివేత, పలు రైళ్ల రాకపోకలు ఆలస్యం కావడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. నిలిపివేసిన రైళ్లలో ఉన్న ప్రయాణికులు ఉక్కపోతతో అల్లాడారు. రైల్వేస్టేషన్లలో రైళ్ల కోసం వేచిచూసిన ప్రయాణికులకూ అవస్థలు తప్పలేదు. గంటల తరబడి స్టేషన్లలో ఉన్నారు. ఎండ తీవ్రతకు ఉక్కపోత తోడవడంతో వృద్ధులు, పిల్లలతో వచ్చిన వారు ఫ్లాట్‌ఫారాలపై ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



పోస్టుకారులను ప్రదర్శిస్తున్న అసోసియేషన్ సభ్యులు

ఇపిఎస్ పెన్షనర్ల పోస్టుకార్డు ఉద్యమం

ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్‌పర్సన్స్ అసోసియేషన్ వెల్లడి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అతి తక్కువ పెన్షన్‌తో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఇపిఎస్ పెన్షనర్లకు న్యాయం చేయాలని ప్రధానమంత్రిని కోరుతూ పోస్టుకార్డు ఉద్యమం చేపట్టనున్నట్లు ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్‌పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.పార్వతీశం, ఎం.ఆదినారాయణ మూర్తి పిలుపునిచ్చారు. ఈ ఉద్యమంలో పెన్షనర్లు, వారి కుటుంబసభ్యులు భాగస్వాములు కావాలన్నారు. నగరంలోని ఎన్‌జిఒ హోంలో అసోసియేషన్ జిల్లా విస్తృతస్థాయి సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికీ సగానికి పైగా ఇపిఎస్ పెన్షనర్లు రూ.వెయ్యి లోపు పింఛను తీసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 80 శాతానికి పైగా రూ.రెండు వేల లోపు మాత్రమే వస్తోందన్నారు. కరువు భత్యం లేనందున జీవిత కాలం అదే పెన్షన్‌తో బతకాల్సి వస్తోందన్నారు. ఆర్థికంగా ఇపిఎస్ పెన్షనర్లు ఇబ్బందులు పడుతున్నారని, ఈ దుస్థితిని నివారించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. 2014లో బిజెపి తన ఎన్నికల మేనిఫెస్టోలో ఇపిఎస్ పెన్షనర్లకు కనీస పెన్షన్ రూ.మూడు వేలు చేస్తామన్న హామీ నేటికీ వాస్తవ రూపం దాల్చలేదన్నారు. కోషియార్ కమిటీ రూ.మూడు వేలు పెన్షన్ చెల్లించాలన్న సిఫార్సును అమలు చేయడం లేదని విమర్శించారు. హై పవర్ కమిటీ నివేదిక వెలుగు చూడనీయలేదన్నారు. పెన్షన్ పెంచాలని పార్లమెంటరీ కమిటీ ఇచ్చిన నివేదికను ఇంతవరకు ప్రభుత్వం ఆమోదించలేదని చెప్పారు. ఈ పరిస్థితుల్లో ఇపిఎస్ పెన్షనర్లందరినీ సమస్యలు చుట్టుముట్టి కనీసం వైద్య సేవలు పొందలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస పెన్షన్ రూ.తొమ్మిది వేలు, కరువుభత్యం చెల్లించాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన హైయర్ పెన్షన్ తీర్పును అందరికీ అమలు చేయాలన్నారు. ఇపిఎస్ పెన్షనర్లకు ప్రభుత్వం ఉచిత వైద్య సేవలు అందించాలన్నారు. రైల్వే ప్రయాణంలో 50 శాతం రాయితీ కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో అసోసియేషన్ కోశాధికారి పి.సుధాకరరావు, గృహ నిర్మాణ సంస్థ విశ్రాంత చీఫ్ ఇంజినీరు శ్రీరాములు, జి.శ్రీనివాసరావు, డి.రాములు, ఎల్.అనంతరావు తదితరులు పాల్గొన్నారు.

శరత్‌బాబుకు సైకత నివాళి




సినీ నటుడు, ఆమదాలవలస అందగాడు శరత్‌బాబు సైకత శిల్పాన్ని సైకత శిల్పి గేదెల హరికృష్ణ చెక్కి నివాళు లర్పించారు. మండలంలోని గాజులకొల్లివలస సంగమేశ్వర స్వామి కొండ దిగువన చెక్కిన సైకత శిల్పాన్ని చూసేందుకు చుట్టుపక్కల గ్రామాలు, పట్టణ ప్రజలు వచ్చారు. సైకత శిల్పాన్ని తిలకించి పాత జ్ఞాపకాలను, అతను నటించిన చిత్రాల విశేషాలను గుర్తు చేసుకున్నారు.

- ప్రజాశక్తి, ఆమదాలవలస

మరిన్ని వార్తల కోసం
epaper.prajasakti.com

గ్రామాల చెంతకే పరిపాలన



ప్రజాశక్తి - గార

సంక్షేమం, అభివృద్ధి సమ ప్రాధాన్యాలుగా పరిపాలన చేస్తున్న వైసిపి ప్రభుత్వం, గ్రామ సచివాలయ వ్యవస్థతో ప్రజల చెంతకే పాలనను తీసుకొచ్చిందని రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. మండలంలో రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన గొంటి గ్రామ సచివాలయాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయ వ్యవస్థతో మండల కేంద్రాలకు వెళ్లాల్సిన పని లేకుండా ఉన్న ఊరిలోనే లంచాల్లేకుండా పనులు జరుగుతున్నాయని చెప్పారు. బ్రిటీష్ హయాంలో చేసిన సర్వే తర్వాత మళ్లీ ఇన్నాళ్లకు సమగ్ర భూ సర్వే చేస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో తగాదాల్లో ఎక్కువగా భూమికి సంబంధించే ఉంటున్నాయని, వీటిని పరిష్కరించుకోలేక ఏళ్ల తరబడి అవస్థలు పడుతున్న వారున్నారని చెప్పారు.

ఇకపై సచివాలయాల్లోనే భూ రిజిస్ట్రేషన్ల ప్రక్రియ అందుబాటులోకి రానుందని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో వైసిపికి ఓటు వేస్తారా, వేయరా అన్నది చూడడం లేదని, పేదరికాన్ని అర్హతగా పరిగణించి పథకాలను అందిస్తున్నామన్నారు. ప్రజలకు ఇంత మంచి పని చేస్తుంటే, విపక్ష నేత చంద్రబాబు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నామని గగ్గోలు పెడుతున్నారని విమర్శించారు. ప్రజలకు పథకాలు అందిస్తే అది తప్పా అని ప్రశ్నించారు. ప్రజలు ఇవన్నీ తెలుసుకోవాలని, ఎవరు మంచి చేస్తున్నారన్నది గుర్తించాలన్నారు. గ్రామంలో తాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు రూ.1.3 కోట్లతో ఇంటింటికీ మంచి నీటిని అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు ధర్మాన రామ్ మనోహర్ నాయుడు, ఎంపిపి గొండు రఘురాం, డిసిఎంఎస్ మాజీ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, శిమ్మ ధర్మరాజు, ఎంపిటిసి కోట రామారావు, పీస గోపి, శ్రీహరిరావు, వైస్ ఎంపిపిలు అరవల రామకృష్ణ, అంధవరపు బాలకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మహానాడుకు ప్రభుత్వం అడ్డంకులు

టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఈనెల 27, 28న రాజమహేంద్రవరంలో టిడిపి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిర్వహించే మహానాడు, ఎన్‌టిఆర్ శతజయంతి ఉత్సవాలకు జగన్ ప్రభుత్వం అడ్డంకులు సృష్టిస్తోందని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ విమర్శించారు. నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్‌టిసి బస్సులకు పర్మిషన్ అడిగితే అధికారులు ఇవ్వలేమని చెప్పడం సిగ్గుచేటన్నారు. బస్సులకు అద్దె చెల్లిస్తే ఆదాయం వస్తుందన్న భావన అధికారులకు ఎందుకు కలగడం లేదన్నారు. ప్రభుత్వం బస్సులకు పర్మిషన్ ఇవ్వకుండా కక్షసాధిస్తోందని ఆరోపించారు. ప్రయివేటు బస్సులను బుక్ చేసుకుంటే బస్సుల లైసెన్స్‌ను రద్దు చేస్తామంటూ వైసిపి నాయకులు బెదిరింపులకు పాల్పడుతున్నారని చెప్పారు. గత మహానాడుకు ఇలాంటి అడ్డంకులే సృష్టించినా టిడిపి శ్రేణులు ఆటోలు, ద్విచక్ర వాహనాల్లో వచ్చి విజయవంతం చేశారని గుర్తుచేశారు. ఎన్‌టిఆర్ రంగస్థల, సినీ నటుడిగా, రాజకీయ పార్టీ వ్యవస్థాపకునిగా ప్రజల మదిలో చెరగని ముద్ర వేసుకున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమానికి 27న 15వేల మందితో ప్రతినిధుల సభ, 28న 15లక్షల మందితో మహానాడు వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందుకోసం నియోజకవర్గాల వారీగా బస్సులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. జగన్ రాక్షస పాలనను అంతమొందించేందుకు మహానాడుకు ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు పి.ఎం.జె బాబు, నగర అధ్యక్షులు మాదారపు వెంకటేష్, తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింతు సుధాకర్, వి.సూరిబాబు, ప్రదాన విజయరాం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రవికుమార్

పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్లాంటేషన్ పనులు, అంచనాలను తయారు చేసి పంపించడంలో నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని డ్వామా పీడీ జి.వి చిట్టిరాజు హెచ్చరించారు. ఉపాధి హామీ క్షేత్రస్థాయి సిబ్బందితో గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా 12,320 మంది లబ్ధిదారులకు అటవీ ప్రాంతాల్లోని భూములకు పట్టాలు ఉన్నాయని, వీరికి ప్రథమ ప్రాధాన్యతను ఇచ్చి భూ అభివృద్ధి పనులు, వ్యక్తిగత తోటల పెంపకం పనులకు తక్షణమే అంచనాలు రూపొందించాలని ఆదేశించారు. రహదారుల పక్కన మొక్కల పెంపకం పనులకు మునగ నర్సరీల ఏర్పాటు, మునగ తోటల పెంపకానికి ప్రాధాన్యతను ఇవ్వాలన్నారు. చెరువు గట్లపై మొక్కలు పెంచాలన్నారు. నిర్దేశించిన లక్ష్యాల మేరకు రోజుకు 2.70 లక్షల మందికి ఉపాధిని చూపించాలని, ఇందులో వైఫల్యం చెందితే సహించేది లేదని హెచ్చరించారు. క్షేత్రస్థాయిలో ఎటువంటి అక్రమాలకు పాల్పడినా చర్యలు తప్పవన్నారు. అమృత్ సరోవర్ చెరువు అభివృద్ధి పనుల పరిశీలనకు ఈనెల 29 నుంచి ప్రత్యేక బృందాలు జిల్లాలో పర్యటించనున్నాయని చెప్పారు. ఏ గ్రామంలోనైనా పనులు లేకుంటే, అక్కడి కూలీలకు పక్క గ్రామంలో ఉపాధిని కల్పించాలని ఆదేశించారు. సమావేశంలో 30 మండలాల సిబ్బందితో పాటు ఫైనాన్స్ మేనేజర్ స్వరూపరాణి, కార్యక్రమ అధికారి కె.వి అప్పలనాయుడు, ప్లాంటేషన్ మేనేజర్ శ్యామల, డిబిటి మేనేజర్ విజయవాణి తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న గిరిజనులు

గిరిజన భూములకు రక్షణ కల్పించాలి

ప్రజాశక్తి- మందస

మండలంలోని చీపి పంచాయతీ పుట్టూరు గ్రామానికి చెందిన గిరిజన భూములను ప్రయివేట్ వ్యక్తులు ఆక్రమించేందుకు ప్రయత్నం చేస్తున్నారని, ఆ భూములను రక్షించి గిరిజనులకు న్యాయం చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు కోరారు. ఈ మేరకు ఆర్‌డిఒ బి.సీతారామమూర్తిని గురువారం గిరిజనులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గిరిజనులు మాట్లాడుతూ 1984 ఏడాది నుంచి విడతల వారీగా అప్పటి ప్రభుత్వాలు సర్వే నంబరు 42/1 నుంచి 20 వరకు గల భూమిని తొమ్మిది మంది గిరిజన కుటుంబాలకు డి పట్టాలు పంపిణీ చేసిందని చెప్పారు. ఆ భూములను మందస మండలం కొత్తపల్లికి చెందిన కర్రి తేజేశ్వర తమను బెదిరించడమే కాకుండా ఆ భూములను ఆక్రమించుకోవాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మా భూములకు రక్షణ కల్పించాలని కోరారు. దీనిపై ఆర్‌డిఒ స్పందిస్తూ గిరిజన భూములు ఆక్రమణకు గురికాకుండా చూస్తామని, సమస్యపై చర్య తీసుకుంటామని చెప్పారు. గిరిజన రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు ఎస్.ధర్మారావు, కె.నవీన్, కె.సుభాష్, కె.బాబూరావు, కె.కృష్ణ, కె.గోవింద్, పి.జానకి, ఎస్.బాలయ్య, సిఐటియు నాయకులు ఎస్.గణపతి పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

శ్రీకాకుళం అర్బన్ : ఇంటర్ సప్లమెంటరీ పరీక్షల్లో గురువారం జరిగిన థియరీ పరీక్షకు 671 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఆర్ఐఒ ఎస్.తవిటినాయుడు తెలిపారు. ఉదయం జరిగిన ప్రథమ ఇంటర్ పరీక్షకు 488 మంది, మధ్యాహ్నం జరిగిన ద్వితీయ ఇయర్ పరీక్షకు 183 మంది హాజరు కాలేదన్నారు. జిల్లా వ్యాప్తంగా 86 పరీక్షా కేంద్రాల్లో ప్రథమ సంవత్సరం జనరల్ కేటగిరీ నుంచి 11,843 పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా, 407మంది హాజరు కాలేదన్నారు. మిగిలిన 11,436 మంది విద్యార్థులు పరీక్ష ప్రశాంతంగా రాశారని అన్నారు. అలాగే ఒకేషనల్ పరీక్షకు 1826 మంది హాజరు కావాల్సి ఉండగా, 81 మంది గైర్హాజరు కావడంతో మిగిలిన 1745 మంది పరీక్ష రాశారన్నారు. ప్రథమ ఇంటర్‌లో 94.54 శాతం మంది పరీక్షకు హాజరయ్యారని తెలిపారు. మధ్యాహ్నం జరిగిన ద్వితీయ ఇంటర్ పరీక్షలో జనరల్ కేటగిరిలో 2023 మంది దరఖాస్తు చేసుకోగా, 164 మంది గైర్హాజరు కావడంతో 859 పరీక్ష పరీక్ష రాశారన్నారు. అలాగే ఒకేషనల్ కోర్సులో 226 మందికి గాను, 19మంది గైర్హాజరు కావడంతో 207 మంది పరీక్ష రాశారని తెలిపారు. జిల్లాలో 87.93 శాతం మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు పరీక్ష రాశారని తెలిపారు.

ట్రైనీ కలెక్టర్‌గా రాఘవేంద్ర మీనా

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్



కలెక్టర్‌కు మొక్కను అందజేస్తున్న రాఘవేంద్ర మీనా

ట్రైనీ కలెక్టర్‌గా రాఘవేంద్ర మీనా నియమితులయ్యారు. ఈ మేరకు కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్‌ను గురువారం కలిశారు. అనంతరం మొక్కను అందజేశారు. విధుల్లో చేరుతూ కలెక్టర్‌కు రిపోర్టు అందజేశారు. కేంద్ర ప్రభుత్వ సర్వీసుల నియమ నిబంధనలకు లోబడి ఆయన జిల్లాలో శిక్షణ పొందుతారు.

పాఠశాల స్థలం ఆక్రమణ!

ప్రజాశక్తి- ఆమదాలవలస

పురపాలక సంఘంలోని రెండో వార్డు పరిధిలో ఉన్న కృష్ణాపురం వద్ద మెయిన్ రోడ్డుకు ఆనుకొని ఉన్న ప్రాథమిక పాఠశాల స్థలాన్ని వాస్తు పేరిట అదే వార్డుకు చెందిన వైసిపి నాయకుడు ఆక్రమణ చేసి ఆంజనేయ విగ్రహం ఏర్పాటుకు పనులు చకచకా చేపడుతుండడంతో పట్టణంలో చర్చనీయాంశం అయ్యింది. పాఠశాల ప్రహరీ లోపల మధ్యాహ్న భోజనం వంటగది బయట వైపు ప్రజలు వాడుకునే తాగునీటి బావి ఉండేవి. వైసిపి వార్డు నాయకుడు ఆంజనేయ విగ్రహం ఏర్పాటు చేస్తామని చెప్పి స్పీకర్ దృష్టికి తీసుకువెళ్లారు. స్థలం కోసం మున్సిపల్ కమిషనర్‌కు దరఖాస్తు చేయగా, అప్పటి ఇన్‌ఛార్జ్ కమిషనర్ ఆ ప్రతిపాదనకు అంగీకరించకుండా తిరస్కరించడంతో కొద్ది రోజులు తాత్కాలికంగా ఈ ప్రతిపాదనను పక్కన పెట్టేశారు. రెండు నెలల కిందట సెలవుపై వెళ్లిన మున్సిపల్ కమిషనర్ రవిసుధాకర్ మళ్లీ విధుల్లో చేరడంతో స్పీకర్‌తో మున్సిపల్ కమిషనర్‌పై ఒత్తిడి తీసుకొచ్చి విగ్రహ ఏర్పాటుకు మున్ముందు చేశారని పలువురు చర్చించుకుంటున్నారు. రాత్రికి రాత్రి పాఠశాల ప్రహరీని వంటగదిని కూల్చివేసి పక్కనే ఉన్న బావిని కప్పేసి స్థలాన్ని చదును చేసి ఆంజనేయ విగ్రహం ఏర్పాటుకు గోతులు తీసి పిల్లర్లను చకచకా ఏర్పాటు చేసే పనిలో మునిగి తేలిపోయారు. నాడు-నేడు కింద ఆధునీకరించిన పాఠశాల ప్రహరీ, వంట గదిని కూల్చివేసి విగ్రహాన్ని నిర్మించడమేమిటని పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పట్టణంలో ప్రభుత్వ స్థలాలను ఇలా రాజకీయ ఆక్రమణదారులు ఆక్రమించుకుంటూ పోతుంటే వాటిని అరికట్టాల్సిన అధికారులు చోద్యం చూస్తూ ఉండడం ఎంతవరకు సమంజసమని ఈ పరిణామాలు దేనికి సంకేతకమని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్థలాన్ని పరిశీలించి ఆక్రమణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు. ఇదే విషయమై మున్సిపల్ కమిషనర్ ఎం.రవి సుధాకర్‌ను వివరణ కోరగా, పాఠశాల ప్రహరీ తొలగింపునకు ఎటువంటి అనుమతులు మంజూరు చేయలేదని, నిర్మాణం చేపడుతున్న విషయం తన దృష్టికి రాలేదని సిబ్బందిని పంపించి పరిశీలన చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు.



పిల్లర్లు వేస్తున్న అక్రమార్కులు

రేపు హెచ్‌సిఎల్ కెరీర్ ప్రోగ్రాం

శ్రీకాకుళం అర్బన్ : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, హెచ్‌సిఎల్ టెక్నాలజీ సంయుక్తంగా ఈ నెల 27న మునసబుపేట గాయత్రి కాలేజ్‌లో కెరీర్ ప్రోగ్రాం, క్యాంపస్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి కో-ఆర్డినేటర్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. క్యాట్ 150 పదాలతో 25 నిముషాల వ్యవధి వ్యాసం టైప్ చేయాల్సి ఉంటుందని అన్నారు. అనంతరం హెచ్‌ఆర్ ఇంటర్వ్యూ ఉంటుందని తెలిపారు. ఏడాది కాలం పాటు టెక్‌బీ ట్రైనింగ్ ప్రోగ్రాం ఉంటుందని, మొదటి ఆరు నెలలు క్లాస్ రూం ట్రైనింగ్ ఉంటుందని అన్నారు. అభ్యర్థులకు అవసరమైన ల్యాప్‌టాప్, ఇంటర్నెట్‌కు నెలకు రూ.650 సంస్థ నుంచి చెల్లిస్తారని అన్నారు. తర్వాత ఆరు నెలల పాటు ఇంటెర్మ్‌షిప్ కోసం నిర్ధేశించిన క్యాంపస్‌కు వెళ్లాలన్నారు. ఇంటెర్న్ షిప్ అభ్యర్థికి నెలకు రూ.పది వేలు అందిస్తున్నట్టు తెలిపారు. హెచ్‌సిఎల్ టెక్‌బి ట్రైనింగ్ ప్రోగ్రాం కోసం అభ్యర్థులు రూ.1,18,000 రుసుం చెల్లించాల్సి ఉంటుందని అన్నారు. ఆర్థికంగా వెనుకబడిన వారు మొత్తం చెల్లించలేని పరిస్థితిలో రూ.30 వేలు చెల్లించి, మిగిలిన రూ.88,000 యాక్సిస్ బ్యాంకు అందించే ఎడ్యుకేషన్ లోన్ పొందవచ్చునని అన్నారు. ఈ లోన్ కోసం అభ్యర్థి ఎటువంటి అదనపు హామీ పత్రాలు సమర్పించాల్సిన అవసరం లేదన్నారు. కేవలం సంస్థ అందించే ఆఫర్ లెటరు సమర్పిస్తే సరిపోతుందని తెలిపారు. ఈ లోన్ అభ్యర్థి హెచ్‌సిఎల్‌లో ఉద్యోగిగా చేరిన తర్వాత తన నెలవారీ జీతంలో ఇఎంఐ రూపంలో చెల్లించవచ్చన్నారు. ట్రైనింగ్‌ని విజయవంతంగా పూర్తి చేసిన అభ్యర్థి ఉద్యోగిగా మారిన అనంతరం ఏడాదికి రూ.1.72 నుంచి రూ.2.2 లక్షల ప్యాకేజీ పొందవచ్చునని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



మెళియాపుట్టి : వాలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

వాలంటీర్లు సంక్షేమ సారథులు

ప్రజాశక్తి- మెళియాపుట్టి

సంక్షేమ పథకాలను పేద ప్రజల వద్దకు చేర్చడంలో కీలకపాత్ర పోషిస్తున్న గ్రామ వాలంటీర్లు సంక్షేమ సారథులని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని చాపర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో వాలంటీర్లకు వందన కార్యక్రమంలో గురువారం వాలంటీర్లను సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాలంటీర్లు చిత్తశుద్ధితో పనిచేసినందు వల్లే ప్రభుత్వానికి మంచి పేరు వచ్చిందన్నారు. పార్టీలకతీతంగా ప్రభుత్వ విధులను నిర్వర్తించాలని వాలంటీర్లకు సూచించారు. కార్యక్రమంలో మండల ప్రజా ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

సంతబొమ్మాళి: గ్రామ వాలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శమని జెడ్‌పిటిసి పాల వసంతరెడ్డి, ఎంపిపి ప్రతినిధి మేరుగు అప్పారావు అన్నారు. మండలంలోని గోవిందపురం సచివాలయంలో వాలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ రెయ్యి రామిరెడ్డి అధ్యక్షతన వాలంటీర్లకు గురువారం సన్మానించారు. రావాడ వీరాస్వామికు సేవా వజ్రా, చల్ల సూర్యనారాయణకు సేవా రత్న, మిగతా 23 మంది వాలంటీర్లకు సేవా మిత్ర అవార్డులు అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు రెయ్యి ప్రసాద్‌రెడ్డి, మోడి భాస్కరరెడ్డి, పల్లి రామారావు, కార్యదర్శి ఎస్.ఢిల్లేశ్వరరావు పాల్గొన్నారు.

పలాస : నిస్వార్థంగా ప్రభుత్వ సేవలను ప్రజలకు అందించడంలో వాలంటీర్ల సేవలు అమోఘమని 17 వార్డు కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్ అన్నారు. కాశీబుగ్గలో రాష్ట్ర ప్రభుత్వం వాలంటీర్లు సేవకు గుర్తిస్తూ అందిస్తున్న గౌరవ సేవా మిత్ర పురస్కారం అవార్డు గ్రహీతలకు సన్మానించారు. కార్యక్రమంలో డొక్కరి రాజారావు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'మహానాడు'ను విజయవంతం చేయాలి

పలాస : ఈ నెల 27, 28 తేదీల్లో రాజమండ్రి నిర్వహిస్తున్న మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పలాస నియోజకవర్గం ఇన్‌ఛార్జి గౌతు శిరీష నాయకులకు, కార్యకర్తలకు ఒక ప్రకటనలో కోరారు. మహానాడు కార్యక్రమానికి బయలుదేరిన వారు తమ పేర్లను పలాస టిడిపి కార్యాలయంలో నమోదు చేసుకోవాలన్నారు. మందస మండలం హరిపురం కూడలి నుంచి, వజ్రపుకొత్తూరు మండలం బెండి గేట్ కూడలి, మున్సిపాలిటీ పలాస మండలం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం నుంచి నియోజకవర్గ పరిధిలో నాలుగు బస్సులు శుక్రవారం రాత్రి 7 గంటలకు బయలు దేరుతాయని తెలిపారు. బస్సులు నిలుపు స్థలాలకు సకాలంలో చేరుకొని మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.



షీల్డ్‌ను అందుకుంటున్న హరీష్

తాడివలస విద్యార్థికి అవార్డు

పొందూరు: పదో తరగతి ఫలితాల్లో బిసి వసతిగృహం విభాగంలో జిల్లాస్థాయిలో ప్రథమ స్థానంలో తాడివలస బిసి బాలుర వసతిగృహానికి చెందిన తమ్మినేని హరీష్ నిలిచారు. ఈ మేరకు విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో బిసి సంక్షేమ శాఖమంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ చేతులు మీదుగా గురువారం అవార్డును అందుకున్నాడు. పది ఫలితాల్లో హరీష్ 575 మార్కులు సాధించి జిల్లాలో బిసి వసతిగృహం విభాగంలో ప్రథమ స్థానంలో నిలవగా, రాష్ట్రస్థాయిలో 14వ స్థానంలో నిలిచాడు. కార్యక్రమంలో సంక్షేమశాఖ జిల్లా అధికారి ఇ.అనురాధ, ఎబిసిడబ్ల్యుఒ ఎల్.అప్పారావు, వసతిగృహం సంక్షేమాధికారి పైడి శ్యామలరావు పాల్గొన్నారు.

28.24 కేజీల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి- జలుమూరు



గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు

మండలంలోని శ్రీముఖలింగంలో గంజాయిని విక్రయిస్తుండగా బుధవారం ఏడుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ పి.పారినాయుడు గురువారం తెలిపారు. శ్రీముఖలింగంలోని ఒరియా వీధిలో దుర్గాప్రసాద్ దాస్, పద్మావతి దాస్, రాజకుమారి దాస్‌లు అక్రమంగా గంజాయి విక్రయాలు చేస్తున్నారని సమాచారం వచ్చిందని అన్నారు. ఈ మేరకు దాడి చేయగా... గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులతో పాటు గంజాయి కొనుగోలు చేస్తున్న హిరమండలం, నరసన్నపేట మండలాలకు చెందిన పన్నీరు ఖుషి కుమార్, దిబారిక రోహిత్, గొర్లె సాయి ప్రకాష్‌లను అరెస్టు చేశామన్నారు. విక్రయదారుల నుంచి 28.24 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. వీరికి ఒడిశా రాష్ట్రానికి చెందిన బృందావతీరావులో గంజాయి తెచ్చి ఇస్తుంటుందని విక్రదారులు తెలిపారని అన్నారు. వీరి ఏడుగురుని అరెస్టు చేసి గురువారం కోటబొమ్మాళి కోర్టులో హాజరు పరిచినట్లు కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.



పోస్టర్లను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

విద్యార్థులకు చుక్కల మందు

నౌపడ: వికాస తరంగణి ద్వారా దీర్ఘాయువు ఆయుర్వేద కేంద్రం ఆధ్వర్యాన నౌపడ ప్రాథమిక, సీతానగరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు స్వర్ణామృత ప్రాశన చుక్కలను సర్పంచ్ పిలక బృందావతి, రవికుమార్‌రెడ్డి గురువారం వేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ 16 ఏళ్లలోపు పిల్లలకు ఈ ఆయుర్వేధ ఔషధం వేయడం వల్ల జ్ఞాపకశక్తి పెంపొందుతుందన్నారు. అలాగే రోగ నిరోధకశక్తి పెంపొందుతుందన్నారు. కార్యక్రమానికి రూ.5 వేలును కొంచాడ దామోదరరావు వితరణగా అందించారు. కార్యక్రమంలో వికాస తరగిణీ సభ్యులు పి.రవికుమార్‌రెడ్డి, వి.వాసుదేవరావు, బి.సోమశ్వర రావు, ఎన్.తిరుపతిరెడ్డి, హెచ్‌ఎం అప్పలరాజు, మధు, విద్య కమిటీ చైర్మన్ లింగరాజు, బాబ్జీ పాల్గొన్నారు.



సర్వేను ప్రారంభిస్తున్న సూర్యారావు

సమగ్ర భూ సర్వేతో రైతులకు మేలు

బూర్జ: సమగ్ర భూ సర్వే తో రైతులకు మేలు చేకూరుతుందని వైస్ ఎంపిపి బుడుమూరు సూర్యారావు అన్నారు. మండలంలోని ఒపివాడ వెంకంపేట గ్రామ పరిధిలో సమగ్ర భూ సర్వేను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ సమగ్ర భూ సర్వేతో రైతులకు శాశ్వత హక్కులను అందించేందుకు సాధ్యపడుతుందన్నారు. ఈ సర్వే అనంతరం రైతులకు చుక్కల భూముల సమస్యలు తొలగి కోర్టుల చుట్టూ తిరిగే పరిస్థితి నుంచి విముక్తి కలగనుందన్నారు. ఈ బృహత్తర భూ సర్వే కార్యక్రమం ద్వారా అనతికాలంగా ఉన్న భూములు రికార్డులు సరిచేయాలని అన్నారు. కార్యక్రమంలో ఓ.వి.పేట విఆర్ఒ లక్ష్మీనారాయణ, సర్వేయర్ నాయుడు, వైసిపి నాయకులు ఎ.రమణమూర్తి, ఎస్.సింగుపురపు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

వరి విత్తనాలకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

ఆమదాలవలస : వరి విత్తనాల కోసం రైతులు రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఎఒ మెట్ట మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఖరీఫ్ 2023 సీజన్ సమీపిస్తున్న తరుణంలో ఆర్‌బికె ద్వారా వరి విత్తనాలను రైతులకు రాయితీ ద్వారా ప్రభుత్వం అందించనున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని రైతులు ఆర్‌బికె వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ తర్వాత విత్తనాలను పంపిణీ చేస్తామని తెలిపారు.

అజాతశత్రువు అప్పలకొండదొర



మాట్లాడుతున్న ఈశ్వరరావు

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

బిజెపి ఎచ్చెర్ల నియోజకవర్గం కన్వీనర్, ఎన్ఇఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ చైర్మన్ నడుకుదిటి ఈశ్వరరావు తండ్రి నడుకుదిటి అప్పలకొండదొర అజాత శత్రువు అని మాజీ ఎమ్మెల్సీలు పి.వి.ఎన్.మాధవ్, జి.విష్ణుకుమార్‌రాజు అన్నారు. మండలంలోని బంటుపల్లి పంచాయతీ నడుకుడిటిపాలెంలో ఎన్ఇఆర్ కేంపస్ వద్ద గురువారం అప్పలకొండ దొర సంతాప సభ గురువారం నిర్వహించారు. ముందుగా అప్పలకొండదొర చిత్రపటానికి పూలమాలులు వేసి నివాళ్లర్పించారు. అనంతరం ఎన్ఇఆర్ తన తండ్రి స్మృతులను నెమరువేసుకున్నారు. తాను ఇప్పుడు ఈ స్థాయికి చేరుకున్నానంటే అదంతా తన తండ్రి చలవేనంటూ తెలిపారు. మంచి మార్గంలో నడవాలని ఎప్పుడూ తెలిపేవారని అన్నారు. గ్రామాభివృద్ధికి అహర్నిశలూ పాటుపడతానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు పైడి వేణుగోపాలం, మాజీ ఎంపిపి డిజిఎం ఆనందరావు, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు గొర్లె లక్ష్మణరావు, కోష్ట మాజీ సర్పంచ్ పిసిని జగన్నాథం నాయుడు, ఎంపిటిసి మాజీ సభ్యులు పైడి అప్పడుదొర, నూకల మధుకర్, కేతినేని సురేంద్ర మోహన్, కె.నారాయణరావు, రెడ్డి పావని పాల్గొన్నారు.


క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 'కాకినాడ ఆదిత్య' సత్తా

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో డిగ్రీ చదువుతున్న 432 మంది విద్యార్థినులు వివిధ కంపెనీల్లో ప్రాంగణ ఎంపికల ద్వారా ఉద్యోగాలకు ఎంపికయ్యారని డైరెక్టర్ బి.ఎస్.చక్రవర్తి, ప్రిన్సిపాల్ శివశంకర్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల అభినందన కార్యక్రమాన్ని కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ తమకు నచ్చిన ఉద్యోగంలో చేరేందుకు ఈ ఎంపిక ద్వారా సాధ్యమైందన్నారు. విద్యలో సాంకేతిక మార్పులను అన్వయించుకుని పోటీకి అనుగుణంగా విద్యార్థినులకు శిక్షణ ఇవ్వడం వేల్ల



ఎంపికైన కాకినాడ ఆదిత్య విద్యార్థులు

ఇది సాధ్యమైందని అన్నారు. యూనివర్సిటీ పరీక్షా ఫలితాల్లో వివిధ పోటీల్లోనూ జిల్లాలోనే మొదటి స్థానాల్లో నిలుస్తున్నామని తెలిపారు. కొలువులు సాధించిన విద్యార్థినులను ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి, సెక్రటరీ డాక్టర్ సుగుణారెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఇ.వి.ఎల్.నాయుడు అభినందించారు.



రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది


140 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి- కవిటి

గెస్ట్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యాన మండలంలోని బొరివంకలో కిడ్నీ బాధితులకు గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కిమ్స్ ఆస్పత్రి సౌజన్యంతో కిడ్నీ, మూత్రకోశ వ్యాధి నిపుణులు డాక్టర్ బెందాలం గౌతమి పర్యవేక్షణలో డాక్టర్లు రమణారావు, కోమలేశ్వరరావు 140 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. అలాగే స్థానిక ఆర్ఎంపిలు, కిడ్నీ బాధితులు, గ్రామస్తులకు కిడ్నీ వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ బెందాలం శ్రీరాంప్రసాద్, గెస్ట్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు బి.శంకరరావు, ఎంపిటిసి దుద్ధి సతీష్, కిమ్స్ మార్కెటింగ్ సిబ్బంది రాజేష్, లక్ష్మణరావు, గెస్ట్ స్వచ్ఛంద సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీరు వృథా

మండలంలోని బొడ్డపాడు కాలనీలో ఉద్దానం కుళాయి ద్వారా తాగునీరు వృథాగా పోతోంది. వేసవిలో నీటి కోసం కొన్ని ప్రాంతాలు అల్లాడిపోతుంటే... ఈ ప్రాంతంలో నీరు వృథాగా పోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. కుళాయి పాడైందని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని స్థానికులు అంటున్నారు.



వృథాగా పోతున్న తాగునీరు

ఇప్పటికైనా ఉద్దానం, పంచాయతీ అధికారులు చొరవ చూపి మరమ్మతులకు గురైన కుళాయిను బాగు చేయాలని కోరుతున్నారు.

\- ప్రజాశక్తి, పలాస



గోతులను పరిశీలిస్తున్న నాయకులు

గోతులను పూడ్చాలి

ప్రజాశక్తి- పలాస

పలాస, వజ్రపుకొత్తూరు మండలాల ప్రజలకు తాగునీరు అందించేందుకు ఇటీవల వేసిన పైపులైన్‌కు తీసి గోతులను తక్షణమే పూడ్చాలని వామపక్ష నాయకులు బి.వాసుదేవరావు, వి.ఆనందరావు, పి.దుర్యోధనలు డిమాండ్ చేశారు. ఈ మేరకు పలాస, వజ్రపుకొత్తూరు మండలాల్లో పర్యటించి గోతులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోతులు తీసి వారాలు గడుస్తున్నా ఇంతవరకు పూడ్చకపోవడం ఏమిటని ప్రశ్నించారు. రోడ్డుకు 5 మీటర్ల దూరంలో తవ్వాల్సిన గోతులను రోడ్డు అంచులకే తవ్వి వాటి మట్టిని రోడ్డుపై వేశారని అన్నారు. దీనివల్ల ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని, రోడ్డులో ఎక్కువగా మలుపులు ఉండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కొబ్బరిచెట్లూరుకు చెందిన దున్న శ్రీను పలాస మండలం నీలావతి, పెద్దనీలావతి సరిహద్దులో ఉన్న మలుపు వద్ద గోతిలో బైక్ జారి పడడంతో గాయపడ్డారని అన్నారు. ఇలా వదిలేయడం, రక్షణ చర్యలు చేపట్టకపోవడం మెగా ఇంజినీరింగ్ కంపెనీ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుందని అన్నారు. గాయపడిన శ్రీను వైద్యం ఖర్చులకు ఆర్థికసాయం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వంకల అప్పలయ్య, సార పాపయ్య, నేతాజీలు పాల్గొన్నారు.

చిన్నారులకు వినోదం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

క్రియేటివ్ చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యాన నగరంలోని తిలక్ నగర్‌లో ఉన్న యుటిఎఫ్ కార్యాలయంలో సమ్మర్ క్యాంపు గురువారం మూడో రోజు కొనసాగింది. ఈ కార్యక్రమంలో 90మంది చిన్నారులు, 18 మంది తల్లిదండ్రులు సంరక్షకులు పాల్గొన్నారు. ముందుగా పిల్లల మట్టి బొమ్మలు, పేపరుతో తయారు చేసిన పువ్వులు, పడవలు, రాకెట్ వంటి ఆట వస్తువులు తయారు చేయించారు. అనంతరం రచయిత చింతాడ రామారావు పిల్లలకు నాటికలు, నాటకాల గురించి వివరించారు. పిల్లల నుంచి ఎదురైన పలు ప్రశ్నలకు ఆయన సమాధానం ఇచ్చారు. విశ్రాంత డిప్యూటీ డిఇఒ కొత్తకోట అప్పారావు పిల్లలకు గ్రూప్ ఈవెంట్స్ గురించి వివరించారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొంటి మురళీధర్ శాస్త్రీయ ఆలోచన విధానాన్ని తెలియజెప్పే చెకుముఖి పుస్తకాన్ని విశదీకరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పేడాడ వేదవతి, క్లబ్ కన్వీనర్ చింతాడ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రామారావు

ఈశ్వరరావుకు డాక్టరేట్

ప్రజాశక్తి- ఆమదాలవలస



ఈశ్వరరావు

పురపాలక సంఘ పరిధిలోని మెట్టక్కివలసకు చెందిన కొప్పల ఈశ్వరరావుకు ప్రఖ్యాత గీతం యూనివర్సిటీ డాక్టరేట్‌ను గురువారం ప్రకటించింది. గీతం యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ విభాగంలో 'డెవలప్‌మెంట్ ఆఫ్ ఇంటిలిజెంట్ మెషిన్ లెర్నింగ్ అప్రోచెస్ ఫర్ సాఫ్ట్‌వేర్ ప్రాజెక్టు' అంశంపై ప్రొఫెసర్ జి.అప్పారావు శిక్షణలో అందించిన సృజనాత్మక పరిశోధనకు ఈశ్వరరావుకు డాక్టరేట్ ప్రకటించారు. ఈశ్వరరావు టెక్కలి ఆదిత్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ కాలేజీలో కంప్యూటర్ సైన్స్ విభాంగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఈశ్వరరావు రావడంపై వైసిపి ప్రచార విభాగం కమిటీ జోనల్ కన్వీనర్ చింతాడ రవికుమార్, చింతాడ రాజశేఖర్, చిగురుపల్లి రవికుమార్, తమ్మినేని రవికుమార్, సత్తారు అజయ్ కుమార్, బొడ్డేపల్లి మన్మథరావు అభినందనలు తెలియజేశారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

టెక్కలి : మండలంలోని చాకిపల్లిలో ఉన్న త్రినాథస్వామి ఆలయ నిర్మాణానికి సంతబొమ్మాళి మండలం సీతానగరానికి చెందిన రెక్క శైలజారెడ్డి గురువారం రూ.12 వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో మంత్రిని అప్పన్న, సింహాచలం, రామారావు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 186 మంది ఎంపిక



ఎంపికలను నిర్వహిస్తున్న కంపెనీ ప్రతినిధి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని గీతం డిగ్రీ కళాశాలలో మేజిక్ బస్సు ఫౌండేషన్ ఆధ్వర్యాన గురువారం జాబ్‌మేళా నిర్వహించారు. ఈ మేళాలో 236 మంది విద్యార్థులు హాజరు కాగా, 186 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ప్రతిభకు పట్టం కడుతూ ఆయా కంపెనీలు ఎంపిక నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎల్.రమేష్, మ్యాజిక్ బస్సు ఇండియా ఫౌండేషన్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కె.ఎ.రాజు పర్యవేక్షించారు. డెక్కన్ ఫైన్ కెమికల్స్, ఎస్‌బిఐ కార్డ్స్, అపోలో ఫార్మసీ, సోలేరా, బిగ్ బాస్కెట్, సిఇటిసి సోలార్ ఎనర్జీ, జయభేరి, నవతా ట్రాన్స్ పోర్టు, మెడిప్లస్, బొల్లినేని మెడ్ స్కిల్స్ (జెమ్స్) వంటి కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ ఎంపికలో విద్యార్హతతో పాటు నైపుణ్యావృద్ధికి పెద్దపీట వేస్తూ కంపెనీల ప్రతినిధులు ఎంపికలను నిర్వహించారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల కరెస్పాండెంట్ శ్రీధర్ అభినందించారు.

సరాంలో కిరాతకం

భార్య తల నరికిన భర్త

ప్రజాశక్తి- పర్లాకిమిడి

గజపతి జిల్లా కాశీనగర్ సమితి ఖండవ పంచాయతీ సరాం గ్రామంలో కిరాతం గురువారం చోటు చేసుకుంది. భర్త తన భార్య తల నరికి సొంత గడప పైనే పెట్టిన సంఘటన స్థానికుల్లో భయంభ్రాంతులకు గురిచేసంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సరాం గ్రామానికి చెందిన చంద్రశేఖర్ ఖర్జీ కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. చంద్రశేఖర్‌కు మద్యం తాగే అలవాటు ఉంది. దీంతో మొదటి భార్యను వేధింపులకు గురిచేయడంతో భర్తను వదిలి కన్నవారింటికి వెళ్లిపోయింది. రెండో భార్యగా ఊర్మిళ ఖర్జీని పెళ్లి చేసుకున్నాడు. వీరికి రెండేళ్ల పాప ఉంది. గ్రామానికి సమీపంలో ఈ ఏడాది జీడి తోటను కవులుకు తీసుకున్నారు. ఇందులో భాగంగా భార్యాభర్తలు తోటకు వెళ్లారు. చంద్రశేఖర్ ఖర్జీ మద్యం తాగి తోట రావడంతో భార్య ఊర్మిళ ఖర్జీ మందలించింది. దీంతో భర్త కోపోద్రిక్తుడై పక్కనే ఉన్న కర్రలపై నెట్టేసి తోటలో ఉన్న కత్తితో తల నరికేశాడు. ఆ తరువాత మొండాన్ని తోటలో వదిలేసి తలను తీసుకొచ్చి ఇంటి గడపలో ఉంచాడు. ఈ దృశ్యాన్ని చూసిన స్థానికులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం చంద్రశేఖర్ ఖర్జీను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మృతదేహానికి శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టానికి తరలించారు. తల్లి మృతి చెందడంతో రెండేళ్ల పాప కన్నీరుమున్నీరుగా విలపిస్తుంది. ఐఐసి సుశాంత్ సాహు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ఊర్మిళ ఖర్జి మృతదేహం



పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎంపిపి దాసు

పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ

సోంపేట : వ్యవసాయశాఖ ద్వారా ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న పచ్చిరొట్ట విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిపి డాక్టర్ దాసు కోరారు. మండలంలోని జింకీభద్ర రైతు భరోసా కేంద్రం వద్ద గురువారం పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 50 శాతం రాయితీతో అందించే పచ్చిరొట్ట విత్తనాలను రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండలానికి 240 క్వింటాళ్ల కేటాయించామని తెలిపారు. ఎఒ నరసింహమూర్తి, సర్పంచ్ పద్మావతి, ఉపసర్పంచ్ ఎస్.జాని, నాయకులు టి.చంద్రశేఖర్, పి.బాబూరావు, పిరియా ధర్మేంద్ర పాల్గొన్నారు.

పాడి రైతులకు దుప్పట్లు పంపిణీ

కంచిలి: మండలంలోని పెద్దశ్రీరాంపురం పంచాయతీ పరిధిలోని 110 మంది పాడి రైతులకు గురువారం ఎంపిపి మాదిన విమల, మాజీ సర్పంచ్ మాదిన రామారావు దుప్పట్లు పంపిణీ చేశారు. సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా దుప్పట్ల పంపిణీ చేపట్టినట్లు విశాఖ డైయిరీ సంస్థ సూపర్‌వైజర్ ఈశ్వర్ తెలిపారు. కార్యక్రమంలో రైతులు ఈశ్వరరావు, జగ్గయ్య, లజపతిరావు ఢిల్లీరావు పాల్గొన్నారు.



దుప్పట్లను పంపిణీ చేస్తున్న విమల



వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్ భానోజీనాయుడు

సర్పంచ్‌ల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి- రణస్థలం

ప్రభుత్వం నిధులు 14, 15 ఆర్థిక సంఘం మంజూరు చేయకపోవడంతో పంచాయతీలు అభివృద్ధికి నోచుకోవడం లేదని రణస్థలం సర్పంచ్ పిన్నింటి వెంకట భానోజీ నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి పిన్నింటి రజని అధ్యక్షతన గురువారం మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్పంచ్‌లకు గౌరవ వేతనం సకాలంలో అందడం లేదని సభ దృష్టికి తీసుకొచ్చారు. తొలుత గ్రామీణ ప్రాంతాల్లో లో, హైవోల్టేజ్ విద్యుత్ సరఫరా అవుతుందని, దీంతో టివిలు, ఫ్యాన్లు, ఫ్రిజ్‌లు పాడువుతున్నాయని సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. జెడ్‌పిటిసి టొంపల సీతారాం మాట్లాడుతూ వికలాంగులకు ఇచ్చే సదరం ధ్రువపత్రాల ఎంపిక మండల మండల కేంద్రంలో ఏర్పాటు చేయాలని కోరారు. వైఎస్ఆర్ కంటి వెలుగు కింద ఉచితంగా కంటి ఆపరేషన్లు చేస్తున్నామని సంబంధిత అధికారి సీతారామమూర్తి తెలిపారు. ఎంఇఒ ఎ.త్రినాథరావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా దుస్తులు, పుస్తకాలు, నోట్ పుస్తకాలు, షూ అందజేస్తుందని అనానరు. నాడు-నేడు పథకం కింద అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నూతన భవనాలు నిర్మిస్తున్నామని అన్నారు. అమ్మఒబడి, విద్యాదీవన, స్కాలర్ షిప్‌లు తదితర అనేక సౌకర్యాలను సమకూరుస్తుందన్నారు. చంద్రశేఖర్ మాట్లాడుతూ పశువులు దానా సబ్సిడీపై సరఫరా చేస్తున్నామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వేల్పురాయి సర్పంచ్ బాలి శ్రీనివాసరావు మాట్లాడుతూ పశువులకు ఇన్స్యూరెన్స్ చేయిస్తున్నామని, మృతి చెందిన పశువులకు ఇప్పటి వరకు ఇన్స్యూరెన్స్ అందడం లేదని సభ దృష్టికి తీసుకొచ్చారు. సిఎస్ డిటి శ్రీనివాసరావు మాట్లాడుతూ వేలిముద్ర పడని రేషన్ లబ్ధిదారులకు కంటి చూపు పరికరం ద్వారా బియ్యం సరఫరా చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్, ఎంపిడిఒ బి.ధనుంజయరావు, స్పెషల్ ఆఫీసర్ బుడుమూరు దుర్గారావు, తహశీల్దార్ సనపల కిరణ్‌కుమార్, మండల ఉపాధ్యక్షులు రాయపురెడ్డి భుజంగరావు, మైలపల్లి కామరాజు, సర్పంచ్‌లు మీసాల శ్రీనివాసరావు, బాలి శ్రీను, బవిరి రమణ పాల్గొన్నారు.



కృష్ణదాస్‌తో మాట్లాడుతున్న భాస్కరరావు

ఎమ్మెల్యేను కలిసిన ఎఎంసి చైర్మన్

ప్రజాశక్తి- పోలాకి

నరసన్నపేట మార్కెట్ చైర్మన్‌గా మాజీ ఎంపిపి, నాయకులు దుంపల భాస్కరరావుని ప్రభుత్వం ఇటీవల నియమించింది. ఈ మేరకు మబగాంలో ఎమ్మెల్యే, వైసిపి జిల్లా అధ్యక్షులు దర్మాన కృష్ణదాస్‌ను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈయన ఎంపికపై వైసిపి నాయకులు, కార్యకర్తలు అభినందించారు. కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎంపిపి ప్రతినిధి ముద్దాడ భైరాగినాయిడు, వైసిపి మండల కన్వీనర్ కణితి కృష్ణారావు, ఉరజాం సర్పంచ్ కణితి సత్తిబాబు, వైసిపి నాయకులు ఆర్.త్రినాథరావు పాల్గొన్నారు.

చిన్నకొంచాడలో అంధకారం

పొందూరు: రెండు రోజులుగా విద్యుత్ సరఫరా లేకపోవడంతో అంధకారంలో అల్లాడుతున్నామంటూ మండలంలోని చిన్నకొంచాడ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం సాయంత్రం వీచిన చిన్నపాటి గాలులకు విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని, లైన్‌మెన్‌కు, విద్యుత్ అధికారులకు ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందించలేదని వాపోయారు. ఈ మేరకు గురువారం సాయంత్రం ట్రాన్స్‌పార్మర్‌ను పరిశీలించి కాలిపోయిందని, శ్రీకాకుళం నుంచి తీసుకురావాల్సి ఉంటుందని చెప్పి వెళ్లిపోయారని తెలిపారు. దీంతో రెండు రోజులుగా చీకటిలోనే గడుపుతున్నామని పేర్కొన్నారు. వేసవికాలం కావడంతో ఉక్కబోతతో ఇంట్లో ఉండలేక, బయటకు రాలేక గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, చిన్నారులు తీవ్రంగా ఇబ్బందులకు గురవుతున్నారని వాపోయారు.. అధికారులు తక్షణమే స్పందించి కొత్త ట్రాన్స్‌పార్మర్ ఏర్పాటు చేసి విద్యుత్‌ను పునరుద్ధరించాలని గ్రామస్తులు కోరుతున్నారు. దీనిపై విద్యుత్‌శాఖ ఎఇ దుర్గాప్రసాద్‌ను వివరణ కోరగా, ట్రాన్స్‌పార్మర్ కాలిపోయిందని, కొత్తది ఏర్పాటు చేసి విద్యుత్‌ను పునరుద్ధరిస్తామని తెలిపారు.

అన్నా క్యాంటీన్ ప్రారంభం

మెళియాపుట్టి : మెళియాపుట్టిలో మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ ఆధ్వర్యాన ఎన్ఆర్ఐ బృందం సహాయంతో అన్నా క్యాంటీన్‌ను టిడిపి మండల పార్టీ అధ్యక్షులు భాస్కర్ గౌడ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదవాడి ఆకలి తీర్చడానికి రూ.5కే భోజనం సదుపాయం టిడిపి హయాంలో చేపట్టామని అన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత దానిని మూసివేసిందని తెలిపారు. కార్యక్రమంలో ఆస్పత్రి కమిటీ మాజీ చైర్మన్ బసవ భాస్కర్‌రెడ్డి, తెలుగు యువత మండల అధ్యక్షులు బసవ పరమేశ్వరరెడ్డి, పెద్దపద్మాపురం సర్పంచ్ ప్రతినిధి మాలతి శ్రీధర్ పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధిలో ట్రస్టు బోర్డు భాగస్వామ్యం

రెవెన్యూ మంత్రి ప్రసాదరావు



పాలక మండలి సభ్యులతో మంత్రి ధర్మాన

శ్రీకాకుళం అర్బన్ : ఆలయాల పాలక మండళ్ల పదవులు కాదని, ఆలయాలాభివృద్ధిలో భాగస్వాములై సమర్థవంతమైన సేవలు అందించాలని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు పిలుపునిచ్చారు. గార మండలం శ్రీకూర్మనాథ స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన కార్యక్రమానికి ఏడాది పూర్తయిన సందర్భంగా గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యాత్రికులకు భోజన వసతి కల్పించడం ఆనందంగా ఉందన్నారు. ఈ పథకం నిర్వహణకు దాతలు అందించిన సహకారం మరువలేనిదన్నారు. ఈ పథకం ప్రారంభానికి ట్రస్టు బోర్డు సభ్యులు తోడ్పాటు అందించారన్నారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు డబ్బిరు శ్రీనివాస్, ముజేటి అప్పల కొండ, బోర కృష్ణవేణి, కొనాడ లక్ష్మి, అనుపోజు నాగరాజు, ఉప్పాడ రమేష్, పుడి కమల, గొరు శ్యామలరావు, సిహెచ్ఎస్ఎన్ ఆచార్యులు, పొన్నాడ ఋషిశ్వరరావు, ఎంపిపి గోండు రఘురాం, సర్పంచ్ గోరు అనిత, యల్లా నారాయణ, కొయ్యన నాగభూషణ్ పాల్గొన్నారు.

'నాడు-నేడు' పనుల నాణ్యత బాధ్యత పేరెంట్స్ కమిటీదే

ప్రజాశక్తి- ఆమదాలవలస

నాడు-నేడు పనుల నాణ్యత బాధ్యత పేరెంట్స్ కమిటీ దేనిని ఎపిఎం పైడి కూర్మారావు అన్నారు. మండలంలోని వెదుళ్లవలస హైస్కూల్‌లో చేపడుతున్న నాడు-నేడు పనులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో గ్రామస్తులు, తల్లిదండ్రుల కమిటీ సహకారంతో వేగవంతంగా నాణ్యతతో జరిపే బాధ్యత తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం పాఠశాలకు అందిస్తున్న రివాల్వింగ్ ఫండ్‌తో మన పాఠశాల మన ఆస్తి మన పిల్లలకే ఉపయోగం అన్న భావనతో పనులు చేపట్టాలని అన్నారు. పాఠశాలకు వంట, తరగతి గదుల్తో పాటు నిత్యం నీటి వసతితో బాల బాలికలకు వేర్వేరుగా మరుగుదొడ్ల సౌకర్యం ఉండాలన్నారు. ప్రతి గదిలోనూ ఫ్యాన్ ట్యూబ్ లైట్, గ్రీన్



పనులను పరిశీలిస్తున్న ఎపిఎం కూర్మారావు

బోర్డు, చక్కని ఫర్నిచర్, ఆకర్షణీయమైన పెయింటింగ్స్ తదితర సౌకర్యాలతో పాఠశాలల పున:ప్రారంభం నాటికి పూర్తి చేయించాలని ప్రధానోపాధ్యాయులు బి.ఈశ్వరరావు, పేరెంట్స్ కమిటీ సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ చిలకలపల్లి సుదర్శనరావు, బొబ్బిలిపేట పాఠశాల ప్రధానోపాధ్యాయులు మెట్ట సన్యాసిబట్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజు

రుణాలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి- నౌపడ

ప్రధానమంత్రి ముద్ర యోజన పథకం కింద బ్యాంకులు అందజేస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని శ్రీకాకుళం ఎస్‌బిఐ శాఖ ఎజిఎం టి.ఆర్.ఎం.రాజు సూచించారు. సంతబొమ్మాళి మండలం ఆకాశలఖవరంలో నౌపడ ఎస్‌బిఐ శాఖ ఆధ్వర్యాన గురువారం పల్లెనిద్ర కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజల చేతివృత్తులు చేసుకునే వారు, చిరు వ్యాపారుల ఆర్థికాభివృద్ధికి ముద్ర, డెయిరీ, ఫౌల్ట్రీ రుణాలు దోహదపడుతాయని పేర్కొన్నారు. ఈ రుణాలు పొందిన వారు పది మందికి జీవనోపాధి కల్పించేస్థాయికి ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో చీఫ్ మేనేజర్ సిద్ధార్థ, నౌపడ బ్యాంకు మేనేజర్ ఎస్.మధుసూదనరావు, మాజీ సర్పంచ్ సుగ్గు రామిరెడ్డి పాల్గొన్నారు.

పాడి రైతులకు 'హెరిటేజ్' అండ

ప్రజాశక్తి- బూర్జ

పాడి రైతులకు హెరిటేజ్ అండగా ఉంటుందని రీజినల్ మేనేజర్ నాగ అప్పారావు అన్నారు. మండలంలోని కె.కె.రాజపురంలో పాడి రైతులతో గురువారం సమావేశం నిర్వహించి ఆవుల పెంపకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హెరిటేజ్ డెయిరీలో పాలు పోసే రైతుల పశువులకు గర్భధారణ కోసం రూ.50 వసులు చేస్తున్నామని అన్నారు. ఆడ దూడ కావాలంటే పశువుల కృత్రిమ గర్భధారణకు రూ.500 రైతులు చెల్లిస్తున్నారని తెలిపారు. హెరిటేజ్‌లో పాలు పోస్తున్న రైతులు ప్రమాదంలో మృతి చెందితే రూ.2 లక్షలు, సహజంగా మృతి చెందితే రూ.50 వేలు బీమా చెల్లిస్తున్నామని స్పష్టం చేశారు. రైతులు సరఫరా చేసే పాలకు ఏ డైయిరీ ఇవ్వని అధిక ధర ఒక్క హెరిటేజ్ మాత్రమే చెల్లిస్తుందని అన్నారు. సమావేశంలో సర్పంచ్ కొరికెన సీతారామరాజు, మాజీ సర్పంచ్ కొరికాన వెంకటరావు, జిల్లా ఏరియా మేనేజర్ మోహన్‌రెడ్డి ప్లాంట్ మేనేజర్ ఎం.అప్పలనాయుడు, హెచ్‌పిఆర్ కొరికాన అరుణ్‌కుమార్, వ్యాపారి సీతారాం, రైతులు కె.సూరన్నాయుడు, కె.సూర్యప్రకాశరావు, శంభాన అసిరినాయుడు, కొరికాన గోవిందరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాగ అప్పారావు

పుస్తక పఠనంపై ఆసక్తి పెరగాలి



ఎచ్చెర్ల : మాట్లాడుతున్న సూర్యనారాయణ

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

పుస్తక పఠనం ద్వారా విజ్ఞానాన్ని పెంచుకోవాలని, అందుకు రోజూ గ్రంథాలయానికి వచ్చి పుస్తకాలను చదవాలని శ్రీచైతన్య టెక్నో స్కూల్ ఉపాధ్యాయులు ఎచ్చెర్ల సూర్యనారాయణ అన్నారు. మండలంలోని ధర్మవరం శాఖాగ్రంథాలయంలో నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరంలో గురువారం పాల్గొని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొత్త కొత్త విషయాలు తెలుసుకోవడానికి గ్రంథాలయాలు ఉపయోగపడతాయని అన్నారు. విజ్ఞానం అన్నది పుస్తకాల ద్వారా వస్తుందని, పుస్తకం చదవడం వల్ల మనసు ప్రశాంతత చేకూరుతుందని పేర్కొన్నారు. అనవసరమైన ఆలోచనలకు దూరంగా ఉండడానికి అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయలు బి.సూర్యనారాయణ, గ్రంథాలయ పాఠకులు జగదీష్, మహేష్, సురేష్, ప్రకాష్, సూరిబాబు, కిరణ్, శంకర్ పాల్గొన్నారు.

లావేరు : చిన్నతనం నుంచే చదువుల్లో పోటీతత్వం ఉండాలని మురపాక శాఖగ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు విద్యార్థులకు క్విజ్, డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. చదువుతోపాటు ఆటపాటల్లోనూ పోటీతత్వం ఉండాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు పి.షణ్ముఖరావు పాల్గొన్నారు.

బలగ : విద్యార్థుల్లో నైపుణ్యాన్ని వెలికితీసేందుకే వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ మాజీ కౌన్సిలర్ ఆబోతుల రామ్మోహన్ అన్నారు. ఇలాంటి కార్యక్రమాలకు పిల్లలకు, తల్లితండ్రుల ప్రోత్సాహం ముఖ్యం అని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి పి.ఉగ్రసేన్, 24 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

టెక్కలి : మనం వినియోగించే పలు వస్తువులను వినియోగించిన అనంతరం విడిచిపెడుతుంటామని, వాటినీ సద్వినియోగం చేసుకోవచ్చని ప్రభుత్వ ఉపాధ్యాయులు టి.సుదర్శనరావు అన్నారు. గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో పేపర్ క్రాఫ్ట్, సైన్స్ ప్రయోగాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వాహకులు అమ్మనమ్మ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న మోహనరావు, ఉగ్రసేన్

సంతబొమ్మాళి : వేసవి విజ్ఞాన శిబిరాలను విద్యార్థులు వినియోగించుకోవాలని గ్రంథాలయాధికారి కె.రామకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులచే స్వాతంత్ర సమరయోధులు జీవితచరిత్రలు చదివించారు. అనంతరం ఆటలు ఆడించారు.